# దీపావళి రాజకీయాలు

**"కా**లిస్తే ఈ యేడే కాల్చాలిరా టపాకాయలూ" అన్నాడు సత్యం.

"అవున్రా! ఎందుకూ?" అన్నాడు శివం, తెలుసుకుని ఉండటం మంచిదని.

"ఎందుకేమిటి? టపాకాయలు కాల్చటం పిల్లల జన్మహక్కు" అన్నాడు సుందరం. ముగ్గురిలోకి సుందరమే రాజకీయవేత్తా, విప్లవ నాయకుడూనూ.

"హైదరాబాదులో నరకాసురుడి ప్రభుత్వం అయిపోలేదుట్రా? అందుకు" అన్నాడు సత్యం.

"హైదరాబాదులో రాక్షస ప్రభుత్వం అయిపోతే మనకేం వరిగిందోయ్?" అన్నాడు విప్లవ నాయకుడు సుందరం.

టపాకాయలు జారిపోతున్నట్టే అనిపించింది శివానికి.

"అట్లా అనటానికి వీల్లేదు. ఎప్పుడో చచ్చిపోయిన నరకాసురుడి కోసం కాల్చుకోగా లేందీ, రజాకార్ల కోసం కాసిని సీమటపాకాయలూ, తాటాకు టపాకాయలూ, మతాబాలూ, పూవొత్తులూ, కడ్డీలూ, జిల్లీలూ, ధరణాలూ, నిప్పుల్లలూ, పాంమందూ, ఎలక్ట్రీతీగె, చిచ్చుబుడ్లూ, విష్ణుచక్రాలూ అవి కొద్దిగా కాల్చుకోరాదేం?" అన్నాడు శివం. అన్నీ వస్తాయని ఆశ ఎట్లాగూలేదు. అనుకోటానికేం?

"మనకేం వొరిగిందేమిట్రా? ఆ దొంగ వెధవల మూలంగానేగా మామయ్యా, అత్తయ్యా పారిపోయి వచ్చిందీ? మామయ్య వంటిమీద కోటుకూడాలేదు, జ్ఞాపకం ఉందా? అత్తయ్యకి జ్వరం! అక్కడ ఇల్లూ, వాకిలీ, గుడ్డలూ, కుర్చీలూ ఏమయ్యాయో తెలీదు! మామయ్య కయితే మనకయినట్టు కాదూ?" అన్నాడు సత్యం.

"మనకయినట్టు కాదూ?" అని వంత పాడాడు శివం.

"అవుననుకో!" అన్నాడు రాజకీయవేత్త సుందరం.

ఇక్కడికి మీటింగు ఒక మెట్టెక్కింది. పిల్లకాయలు ఈ దీపావళికి టపాకాయలు విరివిగా కాల్చవలసిన ఆవశ్యకతను గురించి, ఎట్లాగైతేనేం సభికులందరూ, ఏకాభిప్రాయానికి రాగలిగారు.

సత్యం చల్లగా నాన్న మీద అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడుతూ, ఉపోద్ఘాతంగా

"నిరుడు కూడా నాన్న టపాకాయలు కొని పెడతాను, కొని పెడతాను అంటూనే తలాయించాడు" అన్నాడు.

"ఈ ఏడూ తలాయిస్తాడు!" అన్నాడు శివం బెదురు మొహంపెట్టి.

"ఏదీ? ఎల్లుండి పండుగ! ఇంతవరకూ ఒక్క కాకర పువ్వొత్తన్నా కొనలా! ఈ యేడు కూడా బండిసున్నాయే."

"ఆ క్రిందటేడు భలే కాల్చాం, చక్కహో!" అన్నాడు సుందరం, మంచి రోజులు జ్ఞాపకం తెచ్చుకుంటున్నవాడల్లే.

"నీ మొహం! ఆ క్రిందటేడు నువ్వు కప్పగంతులు చూసి దడుసుకుంటున్నావు. అసలు మీలో ఎవరూ నిజమైన దీపావళీ టపాకాయలెరగరు. శివుడికి పేర్లు తెలుసుకాని వాటిని చూడనన్నా లేదు. టపాకాయలంటే యుద్ధం ముందు కాల్చాం! అవీ టపాకాయలు! ఆ తర్వాత టపాకాయలున్నాయి ఏమిటి?" అన్నాడు పితామహుడిలాటి పధ్నాలుగేళ్ల సత్యం.

"నాకు జ్ఞాపకం లేకేమోయ్? నేను బుట్టెడు జిల్లీలు కాల్చా ఓ చిన్నప్పుడు" అన్నాడు శివం.

"ఒరే సుందరం, ఓ యేడు మామయ్య శేర్లు తెచ్చాడురా! నిజమైన శేర్లు! బందరువి! అవి కాల్చాను చూడు! ఎందుకులే?" అన్నాడు సత్యం.

"అవును, నేను చూశా?" అన్నాడు శివం. "నేలలో పాతిపెడితేనే మన కొబ్బరి చెట్టెత్తు లేచినై పూలు!"

"ఛీ, అవి చిచ్చుబుడ్లు!" అన్నాడు సత్యం.

నాన్న మీది అవిశ్వాస తీర్మానం పెడదోవ పడుతోందని శివం గ్రహించి "నాన్న ఈ యేడు టపాకాయలు కొనిపెట్టనంటే?" అన్నాడు.

"నాన్న ఎట్లాగా కొనిపెట్టడు" అన్నాడు సుందరం, వర్గతత్వం ఎరిగినవాడు కనుక.

"కొనిపెట్టకపోతే ఊరుకోవద్దు" అన్నాడు శివం మితవాద ధోరణిలో.

"ఊరుకోక ఏం చేద్దాం?" అన్నాడు విప్లవ నాయకుడు సుందరం.

"ఏం చేద్దామా? రేపు తలంటు పోసుకోవద్దు. అమ్మ చేసే అప్పచ్చులు తినొద్దు" అన్నాడు సత్యం సత్యాగ్రహ శంఖం పూరించి.

"ఒకవేళ అమ్మ బొబ్బట్లు చేస్తే అవి తినొద్దూ?" అన్నాడు శివం ముందుగా తెలుసుకుని ఉండటం మంచిదని.

సత్యం ఒక్క క్షణం ఆలోచించాడు. అతని ముఖం రాయిలా ముడుచుకుపోయింది. సత్యాగ్రహి దుష్టశక్తులతో రాజీపడరాదు!

"బొబ్బట్లు చేసినా సరే మనం తినం!" అన్నాడు సత్యం.

నాన్న మీద అవిశ్వాస తీర్మానమూ, శాసనధిక్కార తీర్మానమూ ఏకగ్రీవంగా ఆమోదించబడ్డాయి. కాని సుందరం మళ్లీ సందేహం లేవదీశాడు.

"మనం తలంటుకుని, కొత్తబట్టలు వేసుకుని, బొబ్బట్లు తినకపోతే నాన్నకేం?" అన్నాడు సుందరం విప్లవదృష్టితో.

దగ్గిరకి వస్తూ వస్తూ ఉన్న టపాకాయలు కాస్తా మళ్ళీ అంతర్హితమైపోయినట్టయింది శివానికి. వాడు దీనమొహం పెట్టి, "అన్నిటికీ వీడేదో అడ్డు చెబుతాడేంరా?" అన్నాడు.

"నిజమేరా, ఒకవేళ నాన్న ఇస్తానన్నా వీడు టపాకాయలు వద్దంటాడు కూడానూ! గొప్ప, ముష్టి గొప్ప!" అన్నాడు సత్యం.

పరిస్థితులకు తలవంచి సుందరం తన అనుమానాన్ని ఉపసంహరించుకున్నాడు.

## 2

"ఏమండీ పాపం, వాళ్ళకేమన్నా తీసుకురారు? తెగ గోల పెట్టేస్తున్నారు" అన్నది అమ్మ.

"గోలపెట్టరూ దవడపళ్ళూడగొట్టేవాళ్ళు లేకా?" అన్నాడు నాన్న. ఆయనవన్నీ ఫాసిస్టు పద్ధతులే.

"అదేమిటండీ ఇరుగు పొరుగు పిల్లలంతా అవీ ఇవీ కాలుస్తుంటే వాళ్ళకి మట్టుకు కాల్చాలని ఉండదూ?"

"ఒహాళ్ళతో మనకు వంతేమిటి? నిన్ను ఇందుకే పత్రిక చదవ్వే అంటాను. ప్రభుత్వాలు కూడా ఆదాలో పడ్డాయిగదా! మనం దుబారా ఖర్చు చేస్తూ కూర్చుంటే ఎట్లా?"

"ఏడాదికోసారి వచ్చే పండక్కి దుబారా ఖర్చేమిటండీ. మీదంతా చోద్యం?"

"అట్లాగా? గుండుసూది దగ్గిర్నుంచీ ఆదా చేసేది చెయ్యవలసిందే. మన ప్రభుత్వం తీసుకో."

"నాకక్కర్లేదు ప్రభుత్వం. మీరే తీసుకోండి!"

"మన ప్రభుత్వానికి – అదేమిటి? – ఎన్నో కోట్లు ఖర్చుందనుకో. అయినా కూడా వాళ్ళు ఆదా చేస్తున్నారు?"

"ఎంత ఆదా చేస్తున్నారు?"

"సరిగా జ్ఞాపకం లేదు. లక్షలకు లక్షలాదా చేస్తున్నారనుకో!"

"లక్షలు కనక ఆదా చేస్తున్నారు. పోనివ్వండి. పిల్లలు గోలపెడుతుంటే రెండు రూపాయలకి టపాకాయలు పట్టుకు రావటానికి సంపాదకీయమల్లే మాట్లాడతారేమిటి?"

"నేర్చావులే! ఇంటికి పత్రిక రావటం పొరపాటయింది!"

"పోనీ పత్రిక మానేద్దురు గాన్లెండి."

"బాగా చెప్పావు!"

"పోనీ మానకండి. మా ఖర్చు తగ్గించమంటే మీకు నచ్చిందా? వాళ్ళ ఖర్చు తగ్గిస్తే వాళ్ళకెట్లా ఉంటుందీ?"

"అవసర ఖర్చూ, అనవసర ఖర్చూ లేదుటే?"

"వాళ్ళకిది అవసర ఖర్చే."

"అయితే వాళ్ళని పెట్టుకోమను."

## 3

నాన్న లొంగిరాలేదని పిల్లలకి తెలిసింది. అమ్మ పంచమాంగదళంగానూ విదేశాంగ రాయబారిగాను కూడా పనిచేస్తోంది.

ముగ్గురూ వచ్చి నాన్నని అటకాయించారు.

"మాకు టపాకాయలెందుకు కొనిపెట్టవు, నాన్నా?" అన్నాడు సత్యం.

"వెధవల్లారా, టపాకాయలూ లేదు, గిపాకాయలూ లేదు. ఊరుకోండి."

"ఎందుకు లేదూ?" అన్నాడు సుందరం.

"వొళ్ళు కాలిపోతుంది. గుడ్డలు కాలిపోతాయి. ఏమన్నా తినేటందుకు అమ్మ చేస్తుందిలే" అన్నాడు నాన్న.

"మాకోసమని చేస్తుందా ఏమిటీ? నువ్వు అమ్మా తినటానికి చేసుకుని చిన్న పిల్లలం కనక మాక్కూడా పెడతారు. అది మాకు చాలదు" అన్నాడు సుందరం.

"మాకు టపాకాయలు కావాలి" అన్నాడు శివం, తమ కనీస కోర్కెలను మరింత స్పష్టంగా ప్రకటిస్తూ.

"వచ్చే ఏడు చూదాంలే. ఈయేడు డబ్బులేదు" అన్నాడు నాన్న, మిగులు బడ్జెటు కోసం తాపత్రయ పడుతున్న ఆర్థిక మంత్రిలాగా.

"టపాకాయలు కొనకపోతే మేమూరుకోం!" అని సత్యం అల్టిమేటమ్ ఇచ్చేశాడు.

కార్మికుల సమ్మె వార్త విన్న నాన్న డిక్టేటరు మాదిరిగా ఉన్న సత్యం కేసి విచిత్రంగా చూసి, "ఊరుకోక?" అన్నాడు.

"టపాకాయలు కొంటేకొను లేకపోతే మాకు రేపూ ఎల్లుండీ పండుగే వద్దు, మేం తలంటు పోసుకోం, పిండి వంటలు తినం" అన్నాడు సత్యం.

"నువ్వురా?" అన్నాడు నాన్న శివంతో.

"నాకు టపాకాయలు కావాలి" అన్నాడు శివం మితవాద వైఖరిలో.

"నువ్వో?"

"నేను తింటే ఏం, తినకపోతే ఏం?" అన్నాడు సుందరం.

"నేను తింటా నాన్నా. నాకు టపాకాయలసలు అక్కర్లేదు" అన్నాడు విప్లవ వీరుడు సుందరం.

"ఇంకెవరన్నా ఉన్నారా బొబ్బట్లు కావలసినవాళ్ళు?" అన్నాడు.

"బొబ్బట్లు నాక్కూడా కావాలి" అని గట్టిగా అని "టపాకాయలు కూడా కావాలి" అని చేర్చాడు శివం, అనుమానానికి తావులేకుండా.

"టపాకాయలు లేవని ముందే చెప్పాగా? బొబ్బట్లు నీక్కావాలన్న మాట? అక్కర్లేంది నీ కొక్కడికేనుట్రా సత్యం?"

సత్యం ముఖం ఎర్రబడింది. తన తమ్ముల ఎదుట తనకి తీరని అవమానం జరిగింది. అటువంటి వాళ్ళను వెనక వేసుకురావటం కన్న చావే మేలనిపించింది సత్యానికి. తన వెనక లేని ప్రజలకు నాయకత్వం వహించిన రాజకీయవేత్తలాగా బాధపడ్డాడు సత్యం.

"ఇక పదండి" అన్నాడు నాన్న, సమావేశం ముగించే అధ్యక్షుడల్లే.

## 4

నలుగురు మనుషులు గట్టిగా మాట్లాడుతున్న గోలకి పిల్లలు ముగ్గురూ నిద్రలేచారు. ఇల్లంతా దీపాలు వెలుగుతున్నాయి. వంటింట్లో పొయ్యిలు జయ్యిమని మండుతున్నాయి.

*మొదటి ముద్రణ : ఆంధ్రపత్రిక, 3 అక్టోబర్ 1948*